


**గ్రామ, వార్డు సచివాలయ పరీక్షలన్నింటిలో విభజన సమస్యలకు సంబంధించి సిలబస్ ఉంది. పాలన, ఆర్థిక, సామాజిక, రాజకీయ, న్యాయపరమైన విభజనలు, సమస్యలపై అభ్యర్థులు అధ్యయనం చేయాలి. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సమస్యల పరిష్కారానికి కొన్ని ప్రయత్నాలు జరిగాయి. పరీక్షల కోణంలో వాటినీ తెలుసుకోవాలి.**

# విభజన చిక్కులు విడదీసుకుంటూ...

ఏపీ విభజన సమస్యలు - తాజా పరిణామాలు

జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సఖ్యత, సహకారాలు పెరగాలనే ఉద్దేశంతో విభజన చట్టానికి సంబంధించిన కొన్ని కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకుని అమలు చేశారు. అందులో భాగంగానే ఏపీ ప్రభుత్వ భవంతులను తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించారు. 2014 జూన్ రెండో తేదీ నాటికి కొత్త రాష్ట్ర ప్రభుత్వాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏర్పడటంతో పరిపాలన అవసరాల కోసం ప్రభుత్వ భవంతులన్నింటినీ రెండు రాష్ట్రాల మధ్య నాటి గవర్నర్ పంచారు.

## ఉమ్మడి సచివాలయ భవంతుల అప్పగింత

అప్పటి ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ నిర్ణయం ప్రకారం సచివాలయం బ్లాకుల్లో జె, కె, ఎల్, ఉత్తర హెచ్ బ్లాకులను ఆంధ్రప్రదేశ్‌కి కేటాయించారు. ఏపీ ప్రభుత్వం మొదట ఈ బ్లాకుల నుంచే 13 జిల్లాల పరిపాలన కొనసాగించింది. ప్రజల వద్దకు పరిపాలన తీసుకు వెళ్లాలనే లక్ష్యంతో 2016లో ప్రభుత్వ యంత్రాంగాన్ని తరలించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్‌కి కేటాయించిన భవంతులు ఖాళీగా ఉన్నాయి. వీటిని వినియోగించుకోకుండానే కరెంటు బిల్లులు, ఆస్తి పన్ను, నీటి సరఫరా వ్యయాన్ని భరించాల్సి వచ్చింది. ఈ సందర్భంలో తెలంగాణ ప్రభుత్వం ఏపీ బ్లాక్‌లను తమకు ఇస్తే సచివాలయాన్ని పునర్నిర్మించుకుంటామని అభ్యర్థనలు చేసింది. కేవలం సచివాలయ ఆస్తుల విషయంలోనే కాదు షెడ్యూల్ 9, 10 సంస్థల ఆస్తులు, నిధుల పంపిణీ, ఉద్యోగుల విభజన జరిపినప్పుడే రెండు రాష్ట్రాలకు మేలు జరుగుతుందని గత ప్రభుత్వం పేర్కొంటూ భవంతుల అప్పగింతకు నిరాకరించింది. సార్వత్రిక ఎన్నికల అనంతరం ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ కొత్త ప్రభుత్వం రెండు రాష్ట్రాల మధ్య సహకారం, సఖ్యత ప్రధానమని భావించి అప్పగింతకు సిద్ధమైంది.

**అప్పగింత ప్రక్రియ:** తెలంగాణ ప్రభుత్వం ఉమ్మడి గవర్నర్‌ని ఏపీ భవనాలను తమకు అప్పగించాలని మొదట కోరింది. ఆయన మద్దతు తెలపడంతో ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి అంగీకరించారు. ఫలితంగా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం సెక్షన్ 8, 2014 ద్వారా సంక్రమించిన అధికారాలను ఉపయోగిస్తూ గవర్నర్ ఉమ్మడి రాజధానిలో ఆంధ్రప్రదేశ్‌కి కేటాయించిన భవంతులను తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించారు. మొదటి దశలో కే, ఉత్తర హెచ్ బ్లాకులను అప్పగించారు. రెండో దశలో మిగతా బ్లాకులను అప్పగించారు.

## షెడ్యూల్ 9, 10 వివాదాలు

షెడ్యూల్ 9 లో పేర్కొన్న 91 సంస్థలకుగానూ 44 సంస్థల విభజన పూర్తయింది. సార్వత్రిక ఎన్నికల అనంతరం ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ కొత్త ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్ 9, 10 సంస్థలకు చెందిన వివాదాలను పరిష్కరించుకోవడానికి చర్యలు ప్రారంభించాయి. షెడ్యూల్ తొమ్మిది ఆస్తుల విషయంలో ఒక ముగింపు పలకాలని ఇరు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను ఆయా ప్రభుత్వాలు ఆదేశించాయి. కానీ 38 సంస్థల విషయంలో నిర్ణయం తీసుకునే పరిస్థితి లేకపోవడంతో ముఖ్యమంత్రుల స్థాయి సమావేశాన్ని ప్రతిపాదించారు. ముఖ్యమంత్రులు ఇరువురు ఈ విషయాలను సుహృద్భావ వాతావరణంలో పరిష్కరించుకోవాలని చెప్పారు.

మొదట కేంద్ర హోంశాఖ రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ఆగస్టు 8, 2019న ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులతో సమావేశాన్ని ప్రతిపాదించారు. దీనిలో ఎనిమిది అంశాలపై చర్చించాలనుకున్నారు. వాటిలో ప్రధానమైంది 9, 10 షెడ్యూల్ సంస్థల ఆస్తుల వివాదం. అందులో భాగంగా ఏపీ భవన్ విభజనకు సంబంధించిన విషయాలను చర్చించాలని భావించారు. విద్యుత్తు బకాయిల చెల్లింపు, ఏపీహెచ్ఎంఈఎల్ వివాదం లాంటి ఇతర అంశాలూ ఉన్నాయి. పాలనా పరమైన కారణాల వల్ల ఆ మీటింగ్‌ను కేంద్ర ప్రభుత్వం వాయిదా వేసింది.



కొడాలి భవానీశంకర్

## శాసన సభ, శాసన మండలి భవనాలు

రెండు తెలుగు రాష్ట్రాలు ఏర్పడినప్పుడు శాసన ప్రక్రియలో అవరోధాలను తొలగించేందుకు ఉమ్మడి రాష్ట్రాల పాత అసెంబ్లీ హాలుని ఆంధ్రప్రదేశ్‌కు, కొత్త అసెంబ్లీ హాల్‌ను తెలంగాణకు కేటాయించారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసన మండలి సమావేశాలు జరిపిన హాల్‌ని ఆంధ్రప్రదేశ్‌కి ఇచ్చారు. తెలంగాణ శాసనమండలి సమావేశాల కోసం జూబ్లీ హాల్లో తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం ఈ భవనాలనూ తెలంగాణకు ఇచ్చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక అసెంబ్లీ, శాసన మండలి భవనాల్లోనే గత రెండు సంవత్సరాలుగా సమావేశాలు జరుగుతున్నాయి. తెలంగాణ శాసన మండలి కార్యదర్శికి ఈ భవంతులను అప్పగించారు.

**ఎమ్మెల్యే క్వార్టర్స్:** ఆంధ్రప్రదేశ్‌కి కేటాయించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లనూ తెలంగాణ ఎస్టేట్ ఆఫీసర్‌కి అప్పగించారు.

**డైరెక్టరేట్, కమిషనరేట్లు:** రెండు రాష్ట్రాల మధ్య సంబంధిత అధికారుల మధ్య అప్పగింతల కార్యక్రమం జరిగింది. ఆంధ్రప్రదేశ్ పోలీస్ విభాగానికి డీజీపీ భవంతిని, ఇతర ప్రభుత్వ సేవలు అందిస్తున్న విభాగాలకు హెర్మిటేజ్ భవనాన్ని కేటాయించారు. ఈ రెండు భవంతుల నుంచి ఆంధ్రప్రదేశ్ తమ కార్యకలాపాలు నిర్వహించుకోవాలి.

**ఉమ్మడి రాజధాని:** హైదరాబాదులోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్తులను తెలంగాణ ప్రభుత్వానికి కేటాయించినప్పటికీ ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ద్వారా సంక్రమించిన అధికారాలను బట్టి జూన్ 1, 2024 వరకు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా కొనసాగుతుంది.




## నదీజలాల సహకారం

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 పార్ట్ 9లో సెక్షన్ 84 నుంచి 91 వరకు నదీ జలాల నిర్వహణకు సంబంధించిన విషయాలను పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు గోదావరిలోని మిగులు జలాలను కృష్ణానదికి తరలించి కృష్ణా పరీవాహక ప్రాంతంలోని వ్యవసాయ భూములకు తగిన నీటి సరఫరా చేయాలనే ఆలోచనకు ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అంగీకరించారు. ఆ దిశగా అధికారులు చర్చలు జరుపుతున్నారు.

## అమరావతి నిర్మాణం నుంచి తొలగిన సంస్థలు

అమరావతి సస్టెయినబుల్ స్ట్రక్చర్ అండ్ ఇన్‌స్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ నుంచి ప్రపంచ బ్యాంకు వైదొలగినట్లు ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా 715 మిలియన్ డాలర్లు (రూ. 4922 కోట్లు). ఇందులో 300 మిలియన్ డాలర్ల (రూ. 2,066 కోట్లు) ఆర్థిక మద్దతు ఇచ్చేందుకు ప్రపంచబ్యాంకు మొదట సూత్రప్రాయంగా అంగీకరించింది. కేంద్రం సూచనల మేరకు నిష్క్రమిస్తున్నట్లు వెల్లడించింది. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ 200 మిలియన్ డాలర్ల ఆర్థిక మద్దతును వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం బడ్జెట్ నిధుల్లో రూ. 500 కోట్లు రాజధాని అభివృద్ధి కోసం 2019 -20 సంవత్సరానికి కేటాయించింది.



## ఆంధ్రప్రదేశ్‌కు కొత్త గవర్నర్

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014, సెక్షన్ 7 ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు రాష్ట్రపతి నిర్ణయించిన కాలం వరకు ఒకరే గవర్నర్ ఉంటారు. ఈ నిబంధన ప్రకారమే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ రెండు తెలుగు రాష్ట్రాలకు గవర్నర్‌గా కొనసాగారు. జులై 24 2019న నవ్యాంధ్రప్రదేశ్ మొట్టమొదటి పూర్తి స్థాయి గవర్నర్‌గా బిశ్వ భూషణ్ హరిచందన్ ప్రమాణ స్వీకారం చేశారు.

## అమరావతి-అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యావరణ హితమైన 6/4 లైన్‌లతో అమరావతి-అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించిన నిధులు అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా కోరింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వంద కోట్ల రూపాయల నిధులను ఈ ప్రాజెక్టుకు కేటాయించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఈ ప్రాజెక్టు నిర్మితమవుతుంది. హైవే పొడవు 557 కిలోమీటర్లు.

## బకాయిల కోసం తెలంగాణ డిమాండ్

అయిదు సంవత్సరాలుగా రాజ్‌భవన్, హైకోర్టు నిర్వహణకు సంబంధించి రూ. 290 కోట్లు చెల్లించాలని తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌ని కోరింది. జనాభా శాతం ఆధారంగా ఈ లెక్కలు తీసుకున్నట్లు పేర్కొంది. రాజ్‌భవన్ నిర్వహణలో వాటాగా రూ. 25 కోట్లు, హైకోర్టు నిర్వహణలో వాటాగా రూ. 230 కోట్లు, మిగతా చట్టబద్ధ సంస్థల నిర్వహణ కింద మరో రూ. 35 కోట్లు ఆంధ్రప్రదేశ్ చెల్లించాలని తెలంగాణ కోరింది. తెలంగాణ డిస్కమ్‌లకు రూ. 2,406 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేసింది.




అమరావతిలో..

## విభజన సమస్యల పర్యవేక్షణ కమిటీ

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఈ కమిటీ పనిచేస్తుంది. సజ్జల రామకృష్ణారెడ్డి (ముఖ్యమంత్రికి ప్రజా వ్యవహారాల సలహాదారు), రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శి ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. మెంబర్ కన్వీనర్‌గా గత కమిటీ నుంచి కొనసాగుతున్న ఎల్. రామచంద్రారెడ్డి కొనసాగుతారు.

**ఉమ్మడి రాష్ట్ర విభజనానంతరం ఆంధ్రప్రదేశ్‌లో భారీగా 11,158 గ్రామ సర్వేయర్ (గ్రేడ్-3) ఉద్యోగాల భర్తీ జరగబోతోంది. సేవా దృక్పథంతో పనిచేయాలనుకుంటున్న నిరుద్యోగులకు ఇదో మంచి అవకాశం. నియామక పరీక్షకు కొద్ది వ్యవధి మాత్రమే ఉంది. అభ్యర్థులు అందుబాటులో ఉన్న సమయాన్ని సంపూర్ణంగా వినియోగించుకోవటం ముఖ్యం. వివిధ అంశాల పఠనానికి తగిన సమయం కేటాయించుకుని ప్రణాళిక ప్రకారం సన్నద్ధమయితే ఈ పరీక్షలో నెగ్గి కొలువును సాధించవచ్చు!**

# సాధిద్దాం.. సర్వేయర్ కొలువు

గ్రామ సర్వేయర్ గ్రేడ్-3 పరీక్ష ప్రిపరేషన్ విధానం

గ్రామ సర్వేయర్ (గ్రేడ్-3) రాతపరీక్ష ప్రశ్నపత్రం డిప్లొమా స్థాయిలో ఉంటుంది. ఈసెట్ స్థాయిలో సిద్ధమయితే ఉపయోగకరం. పునశ్చరణతో పాటు ఆన్‌లైన్ మాదిరి ప్రశ్నపత్రాలకు జవాబులు రాయడం వల్ల సమగ్ర అవగాహన లేని అంశాలను మెరుగుపరుచుకోవచ్చు.



### పార్ట్- బి: సబ్జెక్ట్ నాలెడ్జ్

ఇది అభ్యర్థి కోర్ సబ్జెక్టులో విషయ పరిజ్ఞానాన్ని పరీక్షించే విభాగం. ఇందులో సిలబస్ మూడు విభాగాలుగా (డ్రాయింగ్, సర్వేయింగ్, డీటేయిలింగ్) ఉంటుంది. ఈ విభాగంలో 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు చొప్పున 100 మార్కులు ఉంటాయి. సమయం 100 నిముషాలు.

**డ్రాయింగ్:** ఏ గ్రామంలోనైనా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేటప్పుడు ఆ ప్రాంతంపై అవగాహన ఎంతో ముఖ్యం. ఈ క్రమంలో ఇంజినీరింగ్ డ్రాయింగ్‌ని ఉపయోగించుకొని అందరికీ అర్థమయ్యేలా ఒక మ్యాప్‌ని స్కేలు ఆధారంగా, ఆ ప్రాంత నమూనాను తయారుచేయవచ్చు. ఈ మ్యాప్... ఒక ప్రాంత పరిమాణం, ఆకారం వివరించడానికి, వైవిధ్యాలు, పరిమితులు తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఈ ఇంజినీరింగ్ డ్రాయింగ్‌లో వివిధ రకాల చిహ్నాలు, ఆకారాలు, కోణాలు, గుర్తులు, ప్రామాణిక కొలతలను ఉపయోగిస్తారు. ఈ పరీక్షకు సన్నద్ధమయ్యేవారికి ఇంజినీరింగ్ డ్రాయింగ్‌లో పూర్తి విషయ పరిజ్ఞానం ముఖ్యం. వివిధ రకాల డ్రాయింగ్ పద్ధతులు, వాటి మధ్య సారూప్యతలు, తేడాలు, ఈ పద్ధతులను ఉపయోగించే విధానం మొదలైనవాటిపై సమగ్ర అవగాహన పెంచుకోవాలి. ఇందులో ఎటువంటి ప్రశ్నలను సాధన చేయాలన్నా ముందుగా ఊహా పరిజ్ఞానాన్ని ఉపయోగించి రఫ్ స్కెచ్ తయారుచేసుకోవాలి. దానివల్ల ప్రశ్నల సాధన వేగం పెరుగుతుంది తద్వారా పరీక్షలో సమయపాలనా సాధ్యమవుతుంది. (నోట్: దిశను సూచించే గుర్తులు (లేబులింగ్ ఆరోస్), మ్యాప్ స్కేలు, లెటరింగ్, నేమింగ్ అనేవి డ్రాయింగ్‌కి ఎంతో కీలకం. సాధారణంగా చాలా మంది వీటి ప్రాముఖ్యం గుర్తించకుండా పరీక్షలో తప్పులు చేస్తుంటారు.)

**సర్వేయింగ్:** ఇది సివిల్ ఇంజినీరింగ్‌లో కీలకమైన సబ్జెక్టు. ఎటువంటి నిర్మాణాలు చేపట్టాలన్నా మొదటగా భూమి కొలత, ఎత్తుపల్లాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇది సర్వేయింగ్ ద్వారానే సాధ్యం. రహదారుల నిర్మాణం చేపట్టాలన్నా, వ్యవసాయ భూముల కొలతలు లెక్కించాలన్నా, కాలువలు నిర్మించాలన్నా సర్వేయింగ్ చేపట్టాల్సిందే. సిలబస్‌లో అన్ని విషయాలూ ముఖ్యమైనవిగానే చెప్పవచ్చు. కానీ ఇప్పుడున్న తక్కువ వ్యవధిలో లెవలింగ్, కంపాస్ సర్వేయింగ్‌లపై ఎక్కువ దృష్టి అవసరం. మొదటగా సర్వేయింగ్‌పై ప్రామాణిక పుస్తకాన్ని ఎంచుకొని, అందులో సిలబస్ ప్రకారంగా థియరీని అధ్యయనం చేయాలి. చిన్న చిన్న ఫార్ములాలతో రాబట్టగల ప్రశ్నలను సాధన చేయాలి. ప్రాథమిక అంశాలపై దృష్టి సారించడం మరవొద్దు. ముఖ్యమైన ఫార్ములాలను విడిగా రాసుకోవడం, షార్ట్ నోట్స్ తయారుచేసుకోవటం వల్ల రివిజన్ వేగంగా పూర్తవుతుంది.

**బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ అండ్ డీటేయిలింగ్:** కట్టడం పునాది నుంచి కాలమ్‌లు, బీమ్‌లు, స్లాబులు, ఫ్లోరింగ్, ఆర్చీలు, స్టెయిర్‌కేస్, గోడలు, పైకప్పు, తలుపులు, కిటికీలు, వెంటిలేటర్లు, లిఫ్టులు మొదలైనవాటిపై అభ్యర్థి సమగ్ర అవగాహనను పరీక్షించేలా ప్రశ్నలుంటాయి. వివిధ రకాల రహదారులు, రైల్వే లైన్లు, నీటి పారుదల నిర్మాణాలు, పైపులైన్లు, డ్రైనేజీలు, శానిటరీ ఫిట్టింగులు, రివిటెడ్ జాయింట్లు, స్టీల్ సెక్షన్లు తదితర నిర్మాణాల డీటెయిల్డ్ డ్రాయింగ్స్‌పై ప్రశ్నలు ఇస్తారు. ముఖ్యంగా రిక్రియేషన్ భవనాలు (థియేటర్లు, టౌన్ హాళ్లు, క్లబ్బులు, హోటళ్లు), నివాస భవంతులు (బంగళాలు, అపార్ట్‌మెంట్‌లు, వరుస ఇళ్లు), రవాణా భవనాలు (బస్‌స్టాండులు, రైల్వే స్టేషన్‌లు, ఎయిర్‌పోర్టులు), సంస్థాగత భవనాలు (ఫ్యాక్టరీలు, వర్క్‌షాపులు, ల్యాబరేటరీలు, జైళ్లు, హాస్పిటళ్లు) నిర్మాణాలపై అభ్యర్థులు దృష్టి సారించాలి. ఈ సబ్జెక్టు నుంచి పూర్తి థియరీ ప్రశ్నలే రావచ్చు. ఈ దిశలో సాధన చేస్తే సమాధానాలను గుర్తించే వేగం, కచ్చితత్వం పెరుగుతుంది. చివరగా అభ్యర్థులు ముఖ్యమైన అంశాలైన మ్యాసనరీ, రూఫ్‌లు, వివిధ నిర్మాణాల క్రాస్ సెక్షన్లపై దృష్టి సారించడం మంచిది.

(జనరల్ స్టడీస్ ప్రిపరేషన్ విధానం కోసం లింక్ https://t.ly/Xr56e లేదా www.eenadupratibha.net చూడవచ్చు.)

**- వై.వి. గోపాలకృష్ణమూర్తి**

### ప్రామాణిక పుస్తకాలు

✦ ఇంజినీరింగ్ డ్రాయింగ్- 1) ఎన్.డి. భట్ 2) కె.ఎల్. నారాయణ ✦ ఇంజినీరింగ్ సర్వేయింగ్- 1) బి.సి. పున్మియా 2) ఎస్. మెహబూబ్ బాషా ✦ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ అండ్ డీటేయిలింగ్- రంగ్‌వాలా ✦ డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్- ఆర్.ఎస్. మాలిక్ అండ్ జి.ఎస్. మియో

## Q&A

● హిస్టరీ, పాలిటీ సబ్జెక్టుల సిలబస్ చాలా ఎక్కువగా ఉంది. ఎలా చదవాలి? సామాజిక న్యాయం, హక్కులు, మహిళా సంక్షేమ పథకాలకు సంబంధించి ఏం ప్రిపేర్ కావాలి? **- భావన, విశాఖపట్నం**

హిస్టరీ, పాలిటీలను మొత్తం చదవాల్సిన అవసరం లేదు. సిలబస్ పరిధిని నోటిఫికేషన్‌లో స్పష్టంగా ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌పై ప్రత్యేక దృష్టితో భారతదేశ చరిత్ర, సంస్కృతిని అధ్యయనం చేయాలి. శాతవాహనులు, ఇక్ష్వాకులు, తూర్పుచాళుక్యులు, కాకతీయులు, విజయనగర రాజుల రాజకీయ చరిత్ర కంటే సాంస్కృతిక అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆధునిక ఆంధ్ర దేశ చరిత్రలో రాజకీయ సంఘటనలను చదవాలి. ముఖ్యంగా జైఆంధ్ర, జైతెలంగాణ ఉద్యమాలు, ఆంధ్రరాష్ట్ర అవతరణ, ఆంధ్రలో జాతీయోద్యమం అంశాలపై దృష్టిపెట్టాలి. పాలిటీ అధ్యయనంలో 73, 74 రాజ్యాంగ సవరణలు, వీటి ద్వారా ఏర్పడిన పరిపాలనా యంత్రాంగం, రాజ్యాంగ నిబంధనలు, కొత్తగా రాష్ట్రంలో ఏర్పడుతున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు నిర్వహించబోయే విధులు, సేవలు తదితరాలను ప్రధానంగా ప్రిపేర్ కావాలి. సామాజిక న్యాయం, హక్కులు, మహిళల విషయానికొస్తే ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల గురించి చదవాలి. వారి కోసం ఏర్పాటు చేసిన రక్షణలు, రాజ్యాంగ నిబంధనలను గుర్తుపెట్టుకోవాలి.

e-mail: edc@eenadu.in

## నోటీస్ బోర్డు

### అప్రెంటిస్‌షిప్

#### హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్

హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్)... రాజస్థాన్‌లోని ఖేత్రి కాపర్ కాంప్లెక్స్‌లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**మొత్తం ఖాళీలు:** 129 **ట్రేడులు:** ఫిట్టర్, టర్నర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, సర్వేయర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ తదితరాలు. **అర్హత:** పదోతరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణత. **వయసు:** 14-30 సంవత్సరాల మధ్య ఉండాలి. **ఎంపిక:** అకడమిక్ మెరిట్ ఆధారంగా **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** సెప్టెంబరు 19 **వెబ్‌సైట్:** https://hindustancopper.com/

### ప్రభుత్వ ఉద్యోగాలు

#### ఎగ్జిమ్ బ్యాంకులో ఐటీ ప్రొఫెషనల్స్

ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎగ్జిమ్ బ్యాంక్)... ఐటీ పర్సనల్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టులు-ఖాళీలు:** డిప్యూటీ మేనేజర్ (ఐటీ)-04, మేనేజర్ (ఐటీ ఫినాకిల్ డెవలపర్)-03. **అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత, అనుభవం. **వయసు:** డిప్యూటీ మేనేజర్-28 ఏళ్లు, మేనేజర్-32 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా. **పరీక్ష తేది:** అక్టోబరు 5 **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** సెప్టెంబరు 9 **వెబ్‌సైట్:** www.eximbankindia.in

#### ఎన్‌హెచ్‌డీసీ లిమిటెడ్

భోపాల్‌లోని ఎన్‌హెచ్‌డీసీ లిమిటెడ్.. ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టులు-ఖాళీలు:** సీనియర్ మెడికల్ ఆఫీసర్-01, ట్రైనీ ఆఫీసర్ (లా, హెచ్ఆర్, ఫైనాన్స్)-08. **అర్హత:** ఎంబీబీఎస్, ఎల్ఎల్‌బీ, సీఏ, సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, అనుభవం. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తు:** ఆగస్టు 23 నుంచి సెప్టెంబరు 11 వరకు. www.nhdcindia.com

## నేర్పిస్తాం.. నగదూ ఇస్తాం!



సబ్జెక్టు పరిజ్ఞానం ఎంత ఉన్నా.. ప్రాక్టికల్ అనుభవం లేకపోతే ఉద్యోగసాధన ఇబ్బందిగా మారుతోంది. అందుకే పలు సంస్థలు అందిస్తున్న అప్రెంటిస్‌షిప్‌ల ప్రాధాన్యాన్ని వివరించే కథనం కోసం క్లిక్ చేయండి.. https://t.ly/E2Alp

## Back up అంటే సమర్థింపేనా?

Back up అనే Phrasal verbను ఉదాహరణల సాయంతో ఎలా ఉపయోగించవచ్చు? తెలుసుకోడానికి క్లిక్ చేయండి... https://t.ly/Xr1PV